పెండ్లిముచ్చట

'కరుణకుమార'

౧

"ఏమండీ ! సీత పెళ్లిసంగతి ఏమనుకొన్నారండీ? ఎన్నిసార్లు చెప్పినా నామాటలు చెవిని పెట్టనేపెట్టరుకదా" అని ఒకరోజు సాయంత్రం నాలుగుగంటలప్పుడు రంగమ్మ కూతురు సీతమ్మకు జడవేసి ముఖాన్న చుక్కబొట్టుపెట్టుతూ, వీధివసారాలో దస్త్రం ముందు పెట్టుకొని కరిణీకం లెఖ్ఖలు వ్రాసుకొంటూవున్న భర్త సీనయ్యతో అన్నది.

కళ్లకు అద్దాలు తగిలించుకొని డస్కుబల్లమీద అడంగల్లో సాగుబడి చెల్లువేసుకొంటూవున్న సీనయ్య భార్యమాటలు చెవిని పడంగనే ముఖం అటుతిప్పి, తల కొంచెం ముందుకు వంచి కంటి అద్దాలమీదుగా చూపు నిగిడ్చి భార్య రంగమ్మవైపూ, కూతురు సీతమ్మవైపూ చూచి చిరునవ్వు నవ్వి "ఏమనుకోవడ మేమిటి? ఈయేడు మా చిట్టితల్లికి తప్పకుండా పెళ్లిచేసితీరాలె" అంటూ "నీ కెట్లాంటిమొగుడు కావాలెనే సీతా!" అని ముద్దుకూతుర్ని ప్రశ్నించాడు. "ఊఁ" అని సాగదీసుకొంటూ సిగ్గుతో తల వంచి తల్లిచేతుల్లోనుండి విడిపించుకొని పంజరంలోనుండి బయటపడ్డ చిలకలాగ తుర్రున పారిపోయింది సీత.

"పిల్లకు పదకొండోయేడు వచ్చిందండీ! ఇక ఇట్లాఉంచడానికి వీల్లేదండీ!" అని భార్య మళ్లా ఆ ప్రస్తావనే చేసింది.

"అవును. ఏదో సంబంధం చూచి ముడి పెట్టితేనేకాని వీల్లేదు" అంటూ సీనయ్య తనపనిధోరణిలో పడ్డాడు.

సీనయ్య నియోగుల్లో పుట్టవలసినవాడుకాడు. పేరుకు కరిణీకం చేస్తున్నాడన్న మాటేకాని ఆ చేయడంలో అందమూ లేదు, చందమూ లేదు. మనిషి భయస్థుడు. అధికార్లంటే హడలిపోతూవుంటాడు; కాని అభిమానధనుడు. నిదానం తక్కువ; ఖంగారెక్కువ. అయినా యింతవరకూ ఎవ్వరిచేతనూ రవ్వంతమాటయినా పడలేదు; ఆయన వయస్సు అరవై సంవత్సరాలు.

సీనయ్యకు ఒకకొడుకూ, ఇద్దరుకూతుళ్లూను. కొడుకు మూడోఫారం ఫేలయి సోదాభాయీలతో చేరి చదువుకోక ఇంటి దగ్గరనే ఉంటున్నాడు. ఎప్పుడయినా బుద్ధి తిరిగినపుడుమాత్రం తండ్రికింత కరిణీకం లెఖ్ఖలు వ్రాసిపెట్టుతూ ఉంటాడు.

సీనయ్యపంతులు పెద్దకూతుర్ని మేనరిక మిచ్చి వివాహంచేసి ఆపిల్లను ఈమధ్యనే సంసారానికి పంపివేశాడు. ఇక రెండోపిల్ల

సీతపెళ్లి ఒకటీ, కొడుకుపెళ్లి ఒకటీ తరవాయిగా ఉన్నవి. కొడుక్కు ఇరవై యేళ్లు ఉన్నా మొగవాడికి తొందరలేదులే అనుకొని, ముందు పెళ్లి ఈడుకు వచ్చిన సీత పెళ్లి చేయాలని నిశ్చయపరుచుకొన్నాడు.

అమర్చి పెట్టినట్లు పెద్దకూతురికి మేనరికం సిద్ధంగా ఉంచినందున సంబంధాలకోసరం వెతుక్కోవలసిన అవసరంగాని, ఆ వెతుక్కోవడంలో గల కష్టంగాని అతనికి తెలియకుండాపోయింది.

పెళ్లిమాటలు తలపెట్టంగనే ఆయనకూతురుపెళ్లి ఆ సంవత్సరంమూఢమివెళ్లినతరువాత మాఘమాసంలో చేద్దామనుకొన్నాడు కాని తీరావివాహప్రయత్నంచేయబోగాఅతనికి దారీతెన్నూ గోచరించలేదు. వరుణ్ని నిశ్చయపర్చుకోవడంలో అతనిమనస్సుకి తెగింపు కలగలేదు. బాగా చదువుకొన్నవాణ్నీ, వెనక ఇంత ఆస్తిపాస్తులుగలవాణ్నీ తీసుకురావాలని భార్య రంగమ్మ కోరిక. కాని చదువూ ఆస్తీకూడా వుంటే లంచాలుపోయాలన్న భయంచేత అంతపెద్దచదువూ, పెద్ద ఆస్తీ లేకపోయినా ఒకమోస్తరుగా ఏదో థర్డుఫారం అయినా ప్యాసయి, సాలుకు రెండుపుట్లు ధాన్యంవచ్చేభూజీవనంగలిగి, ఏషాహుకారు గుమాస్తాగానో నెలకు పైఖర్చుకు పదిరూపాయలు తెచ్చుకోగల పిల్లవాడు దొరకితే, కాళ్లు కడిగి కన్యాదానం చేసుకొందామని కొద్దిలో మట్టగించుకొని ఉన్నాడు సీనయ్య.

కాని ఎంతదేశం తిరిగినా అట్లాంటిపిల్లవాడుకూడా అతగాడికి దొరకలేదు. తిరిగాడు తిరిగాడు అరికాళ్ల అరిగిపొయ్యేటట్టు తిరిగిన పల్లె తిరగకుండా తిరిగాడు. అక్కడక్కడ ఒకటి రెండు సంబంధాలు మంచివే తటస్థపడినవి కాని చదువుంటే ఆస్తీ, ఆస్తి వుంటే సంపాదనా, సంపాదనవుంటే చదువూ- ఇట్లా ఏదో ఒకటి కొరవపడి అతనిమనస్సుకు నచ్చకుండావచ్చినవి.

రోజులు గడచినకొద్దీ అతనికి పెళ్లిబెంగచేత మతిస్థిరం చెడుతూవచ్చింది. ఎన్నాళ్లు తిరిగినా, ఏసంబంధాన్నీ నిశ్చయపరుచుకోలేకపోయాడు. ఇక రెండు నెలల్లో పెళ్లిచేయకపోతే పెద్దమనిషయేటట్టుగా వుంది పిల్ల. పోనీ అందుకయినా సిద్ధమవుదామనుకొంటే ఇక మర్నాటినుండీ ఈ పల్లెకొంపల్లో తద్దినాలకు బ్రాహ్మణులు రారేమో అని అతనికి భయం ఒంటరిగాడు. గ్రామంలో అతనికి రెండో సహాయం లేదు. ఏమీపాలుపోకుండా వుందతనికి. విస్తరిముందు కూర్చుంటే నోటికి అన్నమూ, నీళ్లూ పోవడం లేదు. రాత్రిళ్లు కంటికి నిద్రపట్టడంలేదు. మనిషికి రాను రాను పిచ్చిధోరణీ, పిచ్చివాలకమూ పడుతున్నది.

భర్తవైఖరి చూస్తే రంగమ్మకు కూడా దిగులు ఆరంభించింది.

౨

ఒకరోజు సాయంత్రం సీనయ్యఇంటికి వాళ్లఫిర్కా రెవిన్యూ ఇన్స్పెక్టరు ముసాఫరు

వచ్చాడు. ఆయనకూడా ఆర్వేలవాడే. పని పాటలన్నీ భయభక్తులతో చేసుకుపొయ్యే సీనయ్యను చూస్తే ఆ ఇన్స్పెక్టరుకు అభిమానం. అదిగాక తనకంటె వయస్సులోనూ, అనుభవంలోనూ పెద్దవాడయినందున సీనయ్యంటే ఆయన కొకవిధమైన గౌరవం కూడాను.

రాత్రి భోజనాలకు కూర్చున్న సమయంలో తన కష్టసుఖాలన్నీ ఇన్స్పెక్టరు పంతులుతో మొరపెట్టుకొంటూ సీతపెళ్లి విషయమై తాను పడుతూవున్న అవస్థంతా ఆయనవద్ద వెళ్లబోసుకొన్నాడు.

"నాభార్యకు పినతండ్రికొడుకు కొకడున్నాడు. వాడికి మీఅమ్మాయి నిస్తారా?" అని భోజనం అవుతూండగానే ఇన్స్పెక్టరు పంతులు సీనయ్య నడిగాడు

ఇన్స్పెక్టరుగారు యోగ్యులనీ, సాటి నియోగు లనీ, వారిది మంచిసంప్రదాయమనీ సీనయ్యకుకూడా ఆయనంటే ఎంతో గౌరవమూ, భయమూ, భక్తీని. తన కధికారిగా వచ్చిన ఇన్స్పెక్టరుగారితో సంబంధం చేయడమంటే సీనయ్యకు బ్రహ్మానందమయిపోయింది.

వీధి అరుగు మీద మంచం మీద కూర్చుని తాంబూలం వేసుకొంటూ వున్న ఇన్స్పెక్టరు వద్దకు పోయి "అయ్యా! ఈపిల్ల మీపిల్లకాని మాపిల్లకాదు. తమ యిష్టప్రకారం ఖాయపర్చండి; తమచేతుల్లో ఉంచుతున్నాను మాసీతమ్మను. ఏంచేసినా తమదే భారం" అని సీనయ్య ఆయనగారి రెండు చేతులూ పట్టుకొని "ఇవి చేతులు కావు కాళ్లనుకోండి" అని బొరుమని కన్నీళ్లు నింపాడు.

ఇన్స్పెక్టరుకు జాలివేసింది.

"పెళ్లికొడుకుది అంతగొప్పస్థితి కాదు. హైయరుగ్రేడు ట్రెయినింగు అయి స్వగ్రామంలోనే గ్రాంటుస్కూలు పెట్టుకొని బడి చెప్పుకొంటున్నాడు. సాలుకు నూటఏభయి రూపాయలు గ్రాంటు వస్తుంది. మూడెకరాల మాగాణి ఉన్నది. ముప్పందుంగింజలు మక్తా వస్తుంది. ఇల్లు ఉన్నది: తల్లి ఉన్నది గాని తండ్రిలేడు. అన్న ఒక్కడున్నాడుకాని అతగాడు వేరుపడి ప్రత్యేకంగా సంసారంచేసుకొంటున్నాడు. పిల్లవాడిపేరు రామారావు. బుద్ధిమంతుడు. వయస్సు ఇరవైయేళ్లు. మీకిష్టమేనా?" అని ఇన్స్పెక్టరు సీనయ్యను అడిగాడు.

కొంచెంసేపు సీనయ్యా, రంగమ్మా లోపలికిపోయి గుసగుసలాడుకొని బయటికి వచ్చి "ఇంతకంటె మంచిసంబంధం తేగలమా మేమిటి మేము? అవశ్యం కానివ్వండి" అని సీనయ్యా, రంగమ్మాకూడా తథాస్తంటే తథాస్తన్నారు.

ఆ మర్నాడే ఇన్స్పెక్టరూ, సీనయ్యా కలిసి వరుని గ్రామానికి పోయి పిల్లవాణ్ని చూచుకొన్నారు. రామారావు సీనయ్య

కంటికి నదరుగా అగుపడ్డాడు. సరేనంటే సరేననుకొని తాంబూలాలు తీసుకొన్నారు. వస్తువులకుగాను పెళ్లికూతురికి రు. ౮౦౦ లు పెళ్లికొడుకువారు ముట్టచెప్పేటట్టు నిర్ణయమయింది. ఇందుకు సీనయ్యకంటెనూ అతని భార్య అపరిమితానందం పొందిపోయింది. ఫాల్గుణశుద్ధదశమి॥ మంగళవారంఉదయం ఏడు గంటలకు కర్కాటకలగ్నానికి ముహూర్త నిశ్చయం చేసుకొన్నారు.

3

ఇన్‌స్పెక్టరుగారు తనమీద అనుగ్రహించి తీసుకువచ్చిన మనువయినందున సీనయ్య వివాహం కొంత గొప్పగా చేయాలనుకొన్నాడు. అదికాక, ఇక పెళ్లిచేయవలసిన ఆడపిల్లకాయలు లేనందున ఈపెళ్లి కొంచెం దర్జాగా చేస్తేనేకాని వీల్లేదని రంగమ్మ ఒత్తిడిచేసింది. పెళ్లిరోజుకుముందు సోమవారంనాటి సాయంత్రం అయిదున్నరగంటలకు రెండు స్పెషల్‌బస్సులు వేసుకొని మొగా, ఆడా కలిసి అంతా ఏభయి, అరవైమందివస్తారని పెళ్లివారు ముందుగా తెలియపరిచారు. పెళ్లికి కావలసిన సమస్తమైన వస్తువులూ తెచ్చి సిద్ధపరిచి అన్ని యేర్పాటులూ చేశాడు సీనయ్యపంతులు. సోమవారంనాడు సాయంత్రం ఆరున్నరగంటలకు ఎదుర్కోలూ, వరలక్ష్మీపూజాను, పెళ్లివారికి ప్రత్యేకం విడిది యేర్పాటుచేసి, ఎదుర్కోలు జరపడానికి గ్రామచావడిదగ్గర చిమ్మించి శుభ్రపరిచి సర్వమూ సిద్ధంచేశారు.

ఆడపెళ్లివారి తరఫున రావలసినబంధువులు నలభై, ఏభయిమంది వచ్చారు. మొగపెళ్లివారి తరఫున రెవిన్యూ ఇన్స్పెక్టరూ, ఆయనభార్యా, పిల్లవాడూ మాత్రమే వచ్చారు. అయితే వీరు వారికీవీరికీకూడా సంబంధించినవారే. అందువల్ల ముందుగావచ్చి పెళ్లిసన్నాహంలో సీనయ్యగారికి సహాయపడుతూ వున్నారు. ఎదుర్కోలునాటిరాత్రి గ్రామంలోని బ్రాహ్మణ్యాన్నందరినీ - ఆడవాళ్లనూ, మొగవాళ్లనూ - భోజనాలకు పిలిచి, గ్రామస్థులకూ, పెళ్లివారికీ కలిపి అంతా రెండుమూడు వందలమందికి వంటప్రయత్నం చేశారు. సాయంత్రం అయిదుగంటలు కాగానే, పెళ్లివారు వచ్చేసమయమయిందని ఎదుర్కోవడానికి గ్రామచావడిదగ్గర చాపలు వేయించి సన్నాయిమేళంతోసహా సీనయ్యా, రెవిన్యూ ఇన్స్పెక్టరుపంతులూ తయారుగా వున్నారు.

సాయంత్రం ఆరయింది. ఆరున్నర అయింది. ఏడయి ది. ఏడున్నరఅయింది. గ్యాసులైట్లు వెలిగించారు. పెళ్లివారు రాలేదు. అయిదుగంటలకే వస్తామని చెప్పి పంపిన పెళ్లివారు రాత్రి దీపాలుపెట్టినతరువాతకూడా రాకపోవడంచూచి సీనయ్యకు మనస్సులో కొంతఖంగారు పుట్టుకువచ్చింది. కాని ఇన్స్పెక్టరుపంతులంత పెద్దమనిషి స్వయంగా కుదిర్చిన సంబంధం కాబట్టి రాకుండా మోసంచేస్తారా అని మొదట మొదటలో తనలోతానే సరిపెట్టుకొంటూ

వచ్చాషు. కాని యెనిమిది, యెనిమిదిన్నర, తొమ్మిదిగంటలయ్యేవరకు నిట్టూర్పు లధికమైనవి. అసలే ఖంగారుమనిషి. అందులో ఇంతప్రయత్నంచేసి బంధువులు యావన్మందీ వచ్చి, రెండు మూడు వందలమందికి వంటలు చేయించి — ఇంతవరకూ వచ్చినతరువాత కూడా పెళ్లివారు రాకుంటే ఆయన కెట్లా ఉంటుంది? పెళ్లివారు రాకపోవడానికి కారణమేమిటో ఎవ్వరికీ అర్థంకావడంలేదు.

"ఏమండీ పంతులూ! మనవాళ్లు ఇంకా రాలేదే" అని సీనయ్య ఇన్స్పెక్టరును ఒకటి రెండుసార్లు ప్రశ్నించాడు. "వస్తారు లెండి. తప్పకవస్తారు. ఏదో అనివార్యం జరిగిఉంటుంది. అయినా తప్పకుండా వస్తారు" అని ఆయన చెప్పిన సమాధానం ఆరంభంలో కొంత తృప్తికరంగానే వుండినప్పటికీ రాత్రి తొమ్మిదిన్నర అయిన తరువాతకూడా పెళ్లివారు రాకపొయ్యేవరకు సీనయ్యకు గుండెల్లో రాయిపడింది.

"ఏమి పంతులూ! ఈ పెద్దమనుష్యులు మాగొంతుకు కోయరుకదా?" అని సీనయ్య ఇన్స్పెక్టరును మళ్లా తొందరచేశాడు. కాని యేమి చెప్పడానికీ ఆయనకు తోచడంలేదు. ఆయనకుకూడా ఖంగారుపుట్టింది. ఏమి సమాధానం చెప్పగలడు? అట్లే ఆలోచించాడు. "రాకపోవడానికి నాకేమీ కారణం కనబడదు. దారిలో మోటారేదో చెడివుండాలి. ఏ కారణాన్నయినా వాళ్లురాకపోవడమేజరిగితే వాళ్లునాకయినావర్తమానంపంపేవుందురు: లేదా జాబువ్రాసేవారు. ఈ పెండ్లి యిష్టం లేకపోవడమూ, పెండ్లికి రాకపోవడమూ కాదు. ఏదో అనివార్యం జరిగివుండాలె అని తోస్తుంది" అని సమాధానంచెప్పాడు.

చేసినవంటలన్నీ చేసినట్టే ఉన్నవి. యావత్తుపదార్థమూ చప్పగా చల్లారిపోతోంది. రాత్రి పదిగంటలు దాటింది. ఎవ్వరికీ భోజనాలు లేవు. పెండ్లివారు రాలేదన్న దిగులుతో పసిపిల్లల తల్లులు బిడ్డలకు అన్నాలయినా పెట్టడం మరచి నిద్రపోయారు. రాత్రి భోజనానికి పిలిచిన బ్రాహ్మణ్యం ఇంకా రెండోతడవ పిలుపురాలేదేమా అని ఇంటికాడ వంటలయినా చేసుకోని కారణంచేత తేపతేపకూ వీథిలోకి వచ్చి పిలుపుకోసరం ఎదురుచూస్తూ ఉన్నారు. పెళ్లికూతురు ముఖమూ, రంగమ్మముఖమూ, పెళ్లివారిముఖములూ దిగులుచేత కళావిహీనములైనవి. మొగపెళ్లివారు రాలేదన్న కారణంచేత లైట్లు వెలిగించే సాహెబు నిద్రపోయినాడు. అందువల్ల కాంతితగ్గిపోయే గ్యాసులైట్లు తిరిగీ బాగుచేసే దిక్కులేక ఆడపెళ్లివారి ముఖాలలాగే వెలవెలబోతూ ఉన్నవి. ఎంగిలి విస్తరాకులకోసరం ఎదురుచూచిచూచి విసిగిన యానాదులు అంటిపెట్టుకుపోయిన కడుపులతో బయట గోడలకింద దుమ్ములోనే పండుకొని గాఢనిద్రలో పడ్డారు.

రాత్రి పదకొండయ్యేవరకు ఇక రెండో పిలుపుతో అవసరం లేకుండగనే మనకరణం

గా రేకదా అని గ్రామస్థులు మడిపంచెలూ, పట్టుబట్టలూ కట్టుకొని, చేత చెంబులు పట్టుకొని భోజనానికి తయారయారు. వచ్చిన వారికి ఆడపెళ్లివారు ఆదిగులుతోనే భోజనాలుపెట్టి పంపి వేశారు.

రాత్రి పన్నెండుగంటలు దాటింది. మొగపెళ్లివారు రాలేదు. సీనయ్య మన లోకంలో లేడు. మొగపెళ్లివారు కావాలని మోసంచేశారని అతనికి గట్టినమ్మకం తట్టింది. ఇందులో ఇన్‌స్పెక్టరుపంతులుకూడా కొంత యేదో చేసేవుంటాడన్న అనుమానంకూడా కలిగింది. ఇంతప్రయత్నమూ జరిగి, ఇంత అప్రతిష్ఠా పాలయినతరువాత ఇక మళ్లా తనకూతురికి పెళ్లి అవుతుందా అని అతనికి పెద్దభయం పుట్టింది. అత డెప్పుడూ ఇట్లాంటి కార్యాలు స్వయంగా చేసినవాడు కాడు, చూచినప్పటికీని. ఈపిల్లపెళ్లి తలపెట్టింది లగాయతు అతనిమనస్సుకు అన్నీసంకటాలే ఏర్పడ్డవి. అసలు వరుణ్ణి నిశ్చయపరుచుకోవడానికే పదినెలలు పట్టింది. చివరకు ఆపెళ్లివైభవం ఇట్లా తెల్లవారింది. ఏంచేయగలడు? తానొక వందతిట్లు తిట్టుకొన్నాడు. భార్యనొక వంద తిట్టాడు. పెళ్లికూతురిని రెండువందలు తిట్టాడు. మోసం చేశారని పెళ్లివారిని ముందూ వెనకా చూడకుండా నోటికి వచ్చినట్లు బూతులు తిట్టడం ఆరంభించాడు. అధికారి కాబట్టి రెవిన్యూ ఇన్‌స్పెక్టరును నేరుగా పేరుపెట్టి తిట్టలేక, అన్యాపదేశంగా పిల్లి మీదా యెలుకమీదా పెట్టి ఆయనగారికి కూడా కొన్ని వడ్డించాడు.

“ఇంతపని జరుగుతుందని ఎరక్కపోతినే; ఎంతలో ఇంతమందీ కలిసి నాగొంతుకు కోశారురా! ఇంక నాపిల్ల నెవరు చేసుకొంటారురా దేవుడా!” అని రెండుచేతులతోనూ నోరూ నెత్తీ లబ్బున మొత్తుకోవడం మొదలుపెట్టేడు. అతన్ని చూచి రంగమ్మ కళ్లనీళ్లు పెట్టుకొంటోంది. తలిదండ్రుల నిద్దరినీ చూచి పెళ్లికూతురు పిల్లివలె ఒక గోడమూల నక్కి కూనిదీర్ఘం ఆరంభించింది.

“ఇట్లాంటి పోకిరీజట్టుతో సంబంధం చెయ్యడం మనదే బుద్ధితక్కువ” అని సీనయ్య కొంచెకు ఉద్రేకంతో గంతులు వేస్తున్నాడు.

ఈ గందరగోళం అంతా చూచేవరకు ఇన్‌స్పెక్టరుపంతులుకూ, ఆయనభార్యకూ నలుగురిలోనూ తలకొట్టివేసిన ట్లయింది. కాని ఏంచేయగలరు? తమమాట దక్కించనందుకు వారికి మొగపెళ్లివారిమీద ఆగ్రహం కలుగుతున్నది. ఇంట్లో పరవళ్లే తొక్కే సీనయ్యను చూస్తే సిగ్గవుతున్నది. ఆయన్ని ఓదార్చడానికయినా పంతులుకి ధైర్యం చాలలేదు. పెళ్లికివచ్చిన అమ్మలక్క లందరూ “సెబాస్! బాగా చేశారుకదూ!” అని అంకెళ్లు నొక్కుకొంటున్నారు. అంతమంది ఆడంగులలోనూ ఇన్‌స్పెక్టరుగారి భార్య తేలుకుట్టిన దొంగలా పలక్కుండా ఊరుకోవలసివచ్చింది.

పెళ్లివారిక రారంటే రారనీ, చేసినప్రయత్నమంతా వృథా అయిందనీ, ఇన్నాళ్లకి లోనూ సీనయ్య అప్రతిష్ఠ పాలుకావలసి వచ్చిందనీ నలుగురూ నానారకాలుగా మాటాడడం మొదలుపెట్టారు. అవన్నీ వింటూంటే సీనయ్యకు చెవిలో సీసంకాచి పోసినట్లయింది. ఇంత పరాభవం జరిగిన తరువాత తానిక బ్రతికి ప్రయోజనంలేదని అతనికి జీవితంమీద రోతకలిగింది. ఇక ఒక్క గడియకూడా జీవించి ఉండడం దుర్భర మనిపించింది. ఆ వేదిమీద కూర్చున్న మనిషి గభాలున లేచి ఉత్తరపుదొడ్లోవున్న భావిలో దూకి చచ్చిపోతానని అందరూ వినేటట్టు అరుస్తూ, ఒక్కగంతువేసి బావిదగ్గరకు పరుగుపెట్టాడు. చుట్టుప్రక్కల ఉన్నవాళ్లందరూ ఉలిక్కిపడి "అయ్యో! చస్తాడు కాబోల్రా, పట్టుకోండ్రా" అని అతనివెంట పరుగెత్తి పదిమందీ అదిమిపట్టుకొని బలవంతాన్ని ఇంట్లోకి లాక్కువచ్చి, దక్షిణపు గదిలోకి తోసి తలుపు బయట బిగించారు.

ఇక తాను పలక్కుండా కూర్చోవడం బాగుండదని ఇన్స్పెక్టరుపంతులు ఆ సమయంలో గదితలుపు తెరుచుకొని సీనయ్య దగ్గరకు పోయి "తొందరపడవద్దు సీనయ్యా! మనవాళ్లు తెల్లవారేలోపల తప్పక వస్తారు. కాస్త తమాయించండి. మీ అమ్మాయి పెళ్లికేమీ భయంలేదు. ఇంకో కాస్సేపటికయినా రావాలి. మోటారేదో చెడిపోయి వుంటుందంతే. తొందరపడకు" అని చాలా దూరం మంచిమాటలు చెప్పి సీనయ్యను అనునయించాడు. కాని ప్రాణత్యాగం చేసుకోవడం తప్ప మరోగత్యంతరంలేదని స్థిరపరుచుకొన్న సీనయ్య కామాటలు చెవికెక్కలేదు సరికదా, పైగా ఒళ్లు చుర్రుమని "చాలు చాల్లేవయ్యా! మహాపెద్దమనిషివి! చూస్తూచూస్తూ నీచేతిలో ఇరుక్కున్నాను. తెగీతెగనికత్తితో నాగొంతుకోశావు. పైగా నీతులు చెప్పడానికి వచ్చావు" అని తనకు అధికారి అన్న గౌరవమైనా లేకుండా తీసిపారవేసి విదిలించి జవాబిచ్చాడు. దానితో ఆయనముఖం చిన్నబుచ్చుకొని బయటికి చక్కావచ్చాడు.

౪

రాత్రి ఒంటిగంటన్నర అయింది. పెళ్లివారు రాలేదు. సీనయ్య చీకటిగదిలోనే ఉన్నాడు. గదితలుపు బయట బిగించివుంది. అతడు ఏవిధంచేతనయినా ప్రాణం పోగొట్టుకోవాలని పెద్దప్రయత్నంమీదనే ఉన్నాడు. "చేసినప్రయత్నం బూడిదపాలయిపోవడమే కాకుండా ఇంత అప్రతిష్ఠపాలయినతరువాత ఇంకా పిల్లనెవరైనా చేసుకొంటారా? పాముకు గడవవలసినట్లు నూరేళ్లు గడవవలెనే ఈ బిడ్డజీవనం! పెళ్లికాని పిల్లని ఎన్నాళ్లని ఎదురొమ్ముమీద కుంపటిలా భరించడం? దానినిట్లా గొంతుకు కోసి ఇంకా బ్రతికివుండడం కంటె చావడంమేలు. ఈగుక్కెడుప్రాణంఎట్లా

పోతుందో పోతుంది. ఎప్పటికయినా పోవలసిన వాళ్లమేకదా! ఛీ! ఈయమబాధ నేను పడలేను. ఇంతటితోనయినా సునాయాసంగా పోగలిగితే ధన్యుణ్ణే" అని అతడు ప్రాణత్యాగం ఎట్లాగయినా చేసుకోవాలని నిశ్చయపరుచుకొన్నాడు. గొంతుక్కు ఉరిపోసుకు చావాలని మెడకు గుడ్డ చుట్టి బిగించాలని చూశాడు. కాని ప్రాణంపోయేదాకా బిగించుకోగలనో లేనో అని అతనికి సందేహం కలిగింది. అదిగాక ఈపనిలో ప్రాణికి చాలాబాధ కలుగుతుందని భయంవేసింది. ఏదయినా విషవస్తువు మింగి సునాయాసంగా ప్రాణం పోగొట్టుకోవడం మేలనిపించింది. కాని యెట్లా? గదంతా చీకటిగా వుంది. కన్నూ కన్నూ కనిపించడం లేదు. అతనికి తన కోర్కె నెరవేర్చుకోవడ మెట్లాగో తెలియడం లేదు. గన్నేరుపప్పు తింటే చస్తారన్న సంగతి ఆకస్మికంగా తట్టింది. ఇక్కడ గన్నేరుకాయ లెవ్వి? గన్నేరుచెట్లు దొడ్లో వున్నవి. బయటికిపోతే గన్నేరుకాయలు తెచ్చుకోవచ్చు. కాని బయట తలుపు బిగించివుంది. కూతురు సీతమ్మ తోడిపిల్లకాయలతో రోజూ ఆడుకొంటూవుండే గన్నేరుకాయలూ, చింతగింజలూ, గవ్వలూ వగైరాలు బుట్టలో వేసి ఆగదిలోనే గూటిలో దాచుకోవడం అతనికి తటాలున జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఆగూటి కోసం వెదకులాడాడు. గూడూ, గూటిలో బుట్టా చేతికి తగిలినవి. సీనయ్య బుట్టలో చెయ్యిపెట్టాడు. బుట్టలో కాయలు చేతికి నున్నగా తగిలినవి. గుండెలు దడదడ కొట్టుకొన్నవి. ఈరభసం, ఈరొష్టూ తానుచూడకుండా వెళ్లిపోతే తరువాత వాళ్లతిప్పలువాళ్లు పడతారని సమాధానం చెప్పుకొన్నాడు. పిడికిలితో పిడికిలి కాయలు తీసుకొన్నాడు. ఎట్లో పగలగొట్టి పప్పు నోట్లో వేసుకొని హరహరా అంటూ కళ్లుమూసుకు నమిలి మింగేశాడు. వెంటనే మంచమెక్కి ముసుగు తన్ని భగవన్నామస్మరణ చేస్తూ ప్రాణాచారంపట్టి పండుకొన్నాడు.

సీనయ్య పప్పుతిని అరగంటయింది. ఈ సంగతి బయట ఎవ్వరికీ తెలియదు. అదివరదాకా అరచి అరచి గాభరాచేస్తూవున్న సీనయ్య అర్ధగంటనుండీ చడీచప్పుడూ లేకుండా నిశ్శబ్దంగా ఉండడం చూచి అలసి నిద్రపోయాడు కాబోలునని బయటనున్న వాళ్లనుకొన్నారు. పెళ్లివారు రారని నిరాశ చేసుకొని విధి ఎట్లావుంటే అట్లాజరుగుతుందని జనం యావన్మందీ నిద్రపోయారు. "నాకు లేనిపోని తద్దినం వచ్చి పడిందేమిరా భగవంతుడా" అని ఇన్స్పెక్టరుపంతులు గ్రామచావడిలోనే పక్కపరుచుకొని నడుం వాల్చాడు. విషం ఎప్పటికి పనిచేస్తుందో అని సీనయ్య నిమిషాలు లెక్కపెట్టుకొంటూ ఐహికాన్ని మరచి, ఆముష్మికంమీద దృష్టి వుంచి భగవన్నామం జపిస్తున్నాడు.

ఇంతలో వీధిలో 'బంయ్యి', 'బంయ్యి' మని మోటారుహార్న్ చప్పుడయింది. పెళ్లి పందిట్లో పండుకొన్న యావన్మందీ ఉలిక్కి.

పడి లేచి బిలబిలలాడుతూ వీధిలోకి పేరంటేశారు. రెండుమోటార్లు వచ్చి గ్రామచావడి దగ్గర నిలచినవి. ఇన్స్పెక్టరుపంతులు పెళ్లి పెళ్లివారిని విచారించగా పెళ్లికొడుకు అన్నగారు వచ్చి ఆయన్ని ఓపక్కకు తీసుకువెళ్లి "ఏంచేయమంటావు బావా! ఇక్కడికి తెమిలివచ్చేవరకు తలప్రాణం తోకకు వచ్చింది" అని పెళ్లికూతురికి పెళ్లిసమయంలో వస్తువులకుగాను ఇస్తామని ఒప్పుకొన్న రు.౫౦౧లు సమయానికి దొరకక నానాఅవస్థా పడినట్టూ, అదివరదాకా తప్పకుండా ఇస్తానని ఖరారు చేసిన ఒకపెద్దమనిషి వాయిదాలు వేసి వేసి చివరకు తొంటచెయ్యిచూపి మోసంచేసినట్టూ, అందువల్ల మరొకచోటా, మరొకచోటా తిరిగి ఆడబ్బు సంపాదించుకు రావడంలో అనివార్యంగా ఒక పూటకుపూట ఆలస్యమయినట్టూ కథంతా చెప్పాడు మెల్లిగా. అదిన్నీగాక, తమమేనమామ- పెద్దవాడు- బయలుదేరేవేళకు వస్తానని చెప్పికూడా సరీగా ఆ సమయానికి రాక ఆలస్యంచేయడంవల్ల ఆయనకోసం గంగారం మనిషినిపంపి పిలిపించడంలోకూడా కొంత ఆలస్యమయిందన్నాడు. "సరే, బాగానే వుంది కథ; కాని యీ సంగతు లెవరికీ తెలియనీయకండి ఇక్కడ. నేను చెపుతున్నాను మోటారు చెడిపోయివుంటుందని. మీరుకూడా గమ్మున వూరుకొని ఆలస్యమయిందని మాత్రమే చెప్పండి, ఎవరైనా అడిగితేనే అదయినా" అని సలహా చెప్పి ఇన్స్పెక్టరుపంతులు పెళ్లివారు వచ్చారని సీనయ్యకు కబురుచేశాడు.

రంగమ్మ వచ్చి గదితలుపు తెరిచి 'పెళ్లివారు వచ్చారటండీ!" అని చేత్తోతట్టి సీనయ్యను లేపింది. ఆమాటలు చెవినిపడేసరికి చేస్తూవున్న భగవన్నామస్మరణ మరచి "ఆఁ! వచ్చారూ!" అని లేచి కూర్చున్నాడు సీనయ్య. కాని మంచం దిగలేకపోయాడు. అప్పుడే నవనాళ్లూ లాక్కుపోతూ వున్నట్టుగా వుందతనికి. చావడమా బతకడమా అనే సందిగ్ధావస్థలో పడ్డాడు సీనయ్య. లగ్నానికి ముందుగానే అందుకొన్నారు పెళ్లివారు — ఎంత ఆలస్యం చేసినాను. ఇక చావవలసిన అవసర మేమిటి ?

"అయ్యో! దేవుడా! ఇదేందిరా బాబూ! ఏంఖర్మం వచ్చిందిరా ఇప్పుడు. ఎరక్కపోయి తిన్నాను పప్పు. విరుగు డుందో లేదో దీనికి. చాలాసేపయింది తిని. అప్పుడే నవనాళ్లూ లాక్కుపోతున్నవి. ఏంబుద్ధి?......" అనుకొంటూ కళ్లవెంబడి నీరు కుక్కుకొంటూ ఏడుస్తూ మంచంమీదకూర్చున్నాడుసీనయ్య.

పెళ్లివారు వచ్చారనేసరికి ఇంటికి మళ్లా కళవచ్చింది. గ్యాసులైట్లు హెచ్చించారు. "అమ్మయ్య! సీతమ్మ అదృష్టవంతురాల్రా" అని ఒకరూ, "మోటారు దారిలో చెడిపోయిందట, లేకపోతే సాయంత్రానికే రావలసినవారటమ్మా" అని యింకొకరూ, "ఈసీనయ్యపంతులిది మొదటినుండీ ఒకశేఖంగాను;

నిదానమా వల్లకాదా? ఎంత అఘాయిత్యం చేశాడమ్మా!" అని మరొకరూ, "ఎంతటి వాళ్లకయినా ఇబ్బందులు రాకుండా ఉంటవా, కాస్త ఓపిక పట్టాలి కాని" అని వేరొకరూ—ఇట్లా ఎవరికితోచినట్లు వారంటున్నారు. బయట బయలుదేరిన ఉత్సాహం చూచేవరకు సీనయ్యకు బతికి మళ్లీ పెళ్లి కార్యం జరిపించాలని ఆశపుట్టింది.

"పెళ్లివారు వచ్చి అరగంటసేపయినప్పటికీ బయటికి రాడేం సీనయ్య? ఇంకా కోపమేనా యేమిటి? పోయి వియ్యాలవారిని పలకరించమని ఆయనతో చెప్పండమ్మా! బాగుండదు" అని కొందరమ్మలక్కలారంభించారు. ఈమాటలన్నీ సీనయ్య చెవిలో పడుతున్నవి. ఇంతలో సీనయ్యకొడుకు వచ్చి "నాన్నా! పెళ్లివారు వచ్చారు. నిన్ను గ్రామచావడిదగ్గరకు పిలుచుకురమ్మన్నాడు ఇన్‌స్పెక్టరు పంతులు" అని తండ్రితో చెప్పాడు.

సీనయ్యకు దిక్కుతోచడంలేదు. తొందరగా పోయి వియ్యాలవారిని మర్యాద చేయాలని వుంది. కాని తిన్న విషంమూలాన్ని అసలు అంతదూరం పోగలనో లేనో అని అతనిభయం. కాళ్లూ, చేతులూ లాగడం ఎక్కువయిపోతోంది. పోనీ, బయటికి ఉన్న సంగతి చెప్పివేసి ఏ విరుగుడయినా తిందామనుకొంటే - పైకి చెప్పడానికి సిగ్గు. ఎదురుగా నిలబడ్డకొడుక్కు ఏసమాధానమూ చెప్పకుండానే సీనయ్య గొంతులోకి లోతుగా రెండువేళ్లూ పోనిచ్చి బలవంతంగా ఓక్కు, ఓక్కుమని డోక్కోవడం ఆరంభించాడు కాని పైత్యపు నీరేకాని పైకి పప్పేమీ రాలేదు. క్రమంగా కడుపులో తిప్పుతున్నట్టూ, తల తిరుగుతున్నట్టూ, విషం గుండె కెగతన్నుతున్నట్టూ అయి అతని కావేదన జాస్తి అయింది. ఇక ఆలస్యం చేస్తే విషమిస్తుందని భయం. ఇప్పటికే వొళ్లు కంపరం పుట్టింది. బయటికి చెప్పక విధిలేక తెగించి సీనయ్య కొడుకును దగ్గఱకుతీసి కౌగలించుకొని "నన్ను బతికించరానాయనా! ఏ వైద్యున్నయినా తొందరగా పిలిపించరా! నా ప్రాణం కాపాడరా బాబూ!" అని బావురుమని ఒక్కయేడుపు ఏడ్చాడు. కొడుక్కు ఇదేమీ అర్థంకాలేదు.

"ఏందే? ఈ యేడుపు నాన్నా! పెళ్లివారు వచ్చారే.- ఇక భయంలేదు. ఉదయం ముహూర్తానికి పెళ్లిజరుగుతుంది లేవే- నాన్న ఇదేమిటిదే- అమ్మా! అమ్మా! ఇట్లారా! ఇట్లా అంటున్నాడు ఇదేందే" అని అతడు తల్లిని పిలిచాడు. రంగమ్మ పరుగునవచ్చి ఏమిటేమిటి సంగతని అడిగింది.

"అయ్యో! ఇక నేను బతకనే- నాచావు సమీపించిందర్రో! చద్దామని గన్నేరు పప్పు తిన్నానర్రో! చాలాసేపయిందర్రో! పిల్లపెళ్లి చేసుకు మరీచస్తానర్రో! నన్ను బతికించండర్రో! బుద్ధితక్కువై తిన్నానర్రో!" అని సీనయ్య వెర్రికేకలుపెట్టి మంచంమీద పడి కాళ్లూచేతులూ గిల గిల తన్నుకోవడమారంభించాడు. విషయమంతా వెల్లడయింది.

ఈ సంగతి తెలిసి రంగమ్మ రెండుచేతులతోనూ గుండెలు బాదుకొని "గన్నేరుపప్పే-మింగడమే- అయ్యబాబో!- ఇంకేముందిరా నాయనా! కొంపమునిగిందిరాతండ్రీ! ఇదేం ఖర్మంరా దేవుడా!- ఆయన్ని బతికించే ఉపాయం చూడరా కొడకా!" అని గొల్లుమనింది. ఆ రొదతో బంధువులందరూ మూగారు. నిమిషంలో సంగతంతా గ్రామంలో పాక్కిపోయింది. "సీనయ్య విషం తిని చచ్చా"డని కొందరూ, "చచ్చిపోతున్నా"డని కొందరూ, "ఇంకా చావలేదు. చస్తా"డని కొందరూ- ఇట్లా ఊరంతా గగ్గోలు పుట్టింది. "రామరామా" అనేవారూ, "శివశివా" అనేవారూను. ప్రతీవాళ్లూ చేలాంతరు తీసుకొని కడసారిచూపు చూచి పోదామని జనం వస్తున్నారు.

సీనయ్య రెండుచేతులతోనూ కడుపు పిసుక్కొంటున్నాడు; ఆయాసపడుతున్నాడు; డొక్క ఎగరేస్తున్నాడు; మంచంమీద ఈపక్కకూ ఆ పక్కకూ దొర్లుతున్నాడు. కాళ్లూచేతులూ మంచాన్నివేసి కొట్టుకొంటున్నాడు. దాహం దాహం అంటూవుంటే మధ్యమధ్య సీనయ్యకు కాసినన్నినీళ్లు పోసి నాలుకతడుపుతున్నారు. "నాగతి ఏంచేసి పోతున్నావయ్యా" అని రంగమ్మ భర్తమీద పడి మొత్తుకొంటోంది. ఇంటిల్లిపాదీ, పిన్నా పెద్దా గోల ఆరంభించారు. సీనయ్య వంటిమీద చెయ్యివేసిచూడగా రంగమ్మచేతికి చల్లగా తగిలిన ట్లయింది. "ఇంకేముంది? అయ్యబాబో, ముంచుకువచ్చిందర్రో" అని వెర్రికేక పెట్టింది. జనంలో గంద్రగోళం ఎక్కువయింది.

ఈ సంగతంతా మొగపెళ్లివారికి తెలిసింది. అప్పటికి తొలికోడికూసి రెండుగడియలయింది. గ్రామం అశేషజనానికీ రాత్రితెల్లవార్లూ నిద్రలేదు. ఇన్‌స్పెక్టరు పంతులూ, మగపెళ్లివారిలో కొంతమందీ సీనయ్యను చూడడానికి వచ్చారు. ఎటుపోయి ఎటు వస్తుందో అని పెళ్లికొడుకును కూడా రావద్దన్నారు. ఇన్‌స్పెక్టరుపంతులు వచ్చి సీనయ్యను చేత్తోతాకి పరీక్షించి "ఏమీ విపరీతమయిన గుణాలు లేవే?" అన్నాడు. కాని ఆయన మాటల్లో ఎవ్వరికీ నమ్మకం లేకపోయింది. ఇంతలో నారాయణసింగుకు వర్తమానం వెళ్లింది.

౫

నారాయణసింగు ఇదివరలో సర్కారులో కంపౌండరు నౌకరీచేసి రిటైరయి ఆ గ్రామంలో కాస్తోకూస్తో ప్రైవేటుగా వైద్యం చేస్తున్నాడు. చిరకాలాన్నుంచి గడించిన అనుభవంచేత అతనిమందులు కొందరికి పనిచేస్తున్నవి. కొందరికి పనిచేయటంలేదు. అయినా ఇంజక్షను వైద్యంలో గట్టివాడని ఆ చుట్టుపక్కల అతనికెట్లాగో పేరువచ్చింది. సీనయ్య కొడుకు పిలుపుమీద స్టెతాస్కోపు తీసుకొని నారాయణసింగు చక్కావచ్చాడు. విషయం అంతా విన్నాడు. గన్నేరుకాయలు పగులగొట్టి పప్పు తిన్నానని రోగి తానే

స్వయంగా ఒప్పుకొంటున్నాడు కాబట్టి కడుపులోకి విషం పోయినసంగతి అనుమానమేమీలేదని స్థిరపరచుకొన్నాడు నారాయణసింగు. గుండెలు పరీక్షించాడు. కళ్లూ నాలుకా చూశాడు. తిన్నపప్పు జీర్ణమై ఈపాటికి విషం రక్తంలోకెక్కివుంటుందనీ, ఇప్పుడిక విషం విరుగుడునిమిత్తం ఠోకు మందులిచ్చి ఉపయోగంలేదనీ, ఇంజక్షను ఒక్కటే ఇప్పుడు చేయవలసిన చికిత్స అనీ చెప్పాడు. ఇంజక్షనుకు పదిహేనురూపాయలవుతుందనీ, అప్పటికీ ఒకమందు అక్కడికి ఆరుమైళ్లదూరానవున్న పట్నంనుంచి తెప్పించవలసి ఉంటుందనీ సింగు ఖచ్చితంగా తెలిపాడు. ఇది అంతా వినేవరకు ఇంజక్షను ఇచ్చేవరకు చాలా ఆలస్యమయ్యేటట్టు ఉన్నదని తలచి "తెల్లవారినతరువాత ఆలోచిస్తాంలెండి" అని చెప్పి ఆ నారాయణసింగును పంపివేశారు.

ఆగ్రామంలో కంసాలి భద్రయ్య గొప్ప నాటువైద్యుడని పేరు. అతన్ని పిలిపిస్తే ప్రస్తుతం తాత్కాలికంగా ఏదో చిట్కావైద్యం చేస్తాడని ఎవరో అన్నారు. వెంటనే అతనికోసం మనిషి పరుగెత్తాడు. భద్రయ్య తన మందులసంచి తీసుకొని వచ్చి సీనయ్య నాడి చూశాడు. కడుపు నొక్కాడు. కళ్లు చూశాడు—పెదవి విరిచాడు. లాభం లేదన్నాడు. సూర్యోదయం అయి పైత్యపు ఎండ ఎక్కిందంటే ఇక మనిషి మీకు దక్కడన్నాడు. సీనయ్యకు మూలుగెక్కువయింది. దాహం అంతకన్న ఎక్కువయింది. తాపం హెచ్చిపోతోంది. ఒగర్పు అధికమయింది. సీనయ్యకు దొర్లాట హెచ్చింది. "ఈమనిషిని బ్రతికించడానికి నావల్లకా" దంటూ కంసాలి భద్రయ్య తనసంచి తీసుకొని వచ్చిన దారినే వెళ్లిపోయాడు. ఇంటిల్లిపాదీ గొల్లుమన్నారు.

తెల్లవారుతోంది. తూర్పురేఖలు కనబడుతున్నవి. ఉదయం అయిదున్నర దాటింది. సీనయ్య యింటిదగ్గర రోదనశబ్దం మిన్నుముట్టింది. సూర్యోదయం అయిన తరువాత ఇక ఘటం నిలవదని భద్రయ్య చెప్పాడు. సూర్యోదయం ఎప్పుడవుతుందో, ప్రాణం ఎప్పుడు పోతుందో అని చూస్తున్నారు అంతాను. ఆగదిలోనే కింద గడ్డిపరిచి సీనయ్యను భూశయనం చేశారు. మామా ఏం చెప్పావంటే మామా ఏం చెప్పావని సీనయ్యచుట్టూ మూగారు బంధువులు. సీనయ్య తెలివిగానే వున్నాడింకా! కాని వెర్రిచూపులు చూస్తున్నాడు. వొళ్లంతా తెగచెమటలు పోస్తున్నవి. ఆరాటం ఇంకా హెచ్చవుతోంది.

ఇన్స్పెక్టరుపంతులూ, మొగపెళ్లివారూ సంప్రతించుకొని ఇక ఈ పరిస్థితుల్లో పెళ్లిసంగతి ప్రస్తావనచేయడం బాగుండదని, తరువాత సంగతి చూచుకోవచ్చునని అప్పటికి పెళ్లివారందరూ ఎవ్వరితోనూ చెప్పకుండా స్వగ్రామానికి చక్కాపోయారు. "ఇంత వెర్రివెంగళప్ప సీనయ్యకూతురిని తానిక పెళ్లిచే

సుకో"నని పెళ్లికొడుకుమాత్రం ఏమేమో శాబ్దీలుతీసి మరీ వెళ్లిపోయాడు. భార్యనూ, పిల్లవాణ్నీ ఇంటికిపంపివేసి ఇన్‌స్పెక్టరుపంతులు మాత్రం తాను సీనయ్యఇంటివద్దనే నిలిచి పోయాడు. 'శుభం తలిస్తే ఇట్లావచ్చిందేమి టిరా' అని విచారించాడు ఇన్‌స్పెక్టరు పంతులు.

౬

అప్పుడే సూర్యోదయమయి బారెడు పొద్దెక్కింది. కాని సీనయ్య కింకా ప్రాణంపో లేదు. ఏడుస్తున్నవారు కొందరూ, ఓదారుస్తున్నవారు కొందరూను

అంతకుముందు రెండురోజులక్రిందట ఆ ప్రక్కగ్రామానికి ఇద్దరు అత్తరుసాహేబులు వచ్చి అత్తర్లమ్ముకొంటున్నారు. ఉదయాన్నే ఆగ్రామాన్నుండి బయలుదేరి కరణంగారింట పెళ్లి అని విని అత్తరేమైనా ఖర్చవుతుందేమో అని పందిరిని ఆనమాలు కట్టి కరణంగారిఇంటికి వచ్చారు. అక్కడ పెళ్లీ లేదు: ఏమీ లేదు. ఏడుపులూ పెడబొబ్బలూను. కరణంగారికుటుంబం అంతా మహాసముద్రంలో మునిగివుంది. ఇక గంటకో అరగంటకో సీనయ్యప్రాణం పోతుందని నిరాశచేసుకొని దుఃఖసాగరంలో మునిగి వున్నారు అంతాను.

ఆ యిద్దరుసాహేబులలో ఒకనికి కొంచెం యూనానీవైద్యం తెలుసును. అతడు జబ్బేమిటి, విషయమేమిటని బయటపందిట్లో వున్న ఒకమనిషి నడిగాడు. "గన్నేరుకాయ పప్పు తిన్నాడు కరణంగారు నిన్నరాత్రి. ప్రాణంమీదికివచ్చింది." అని జవాబిచ్చాడు ఆమనిషి. నన్నుచూడనివ్వండన్నాడు సాహేబు. సీనయ్యనుమంచంమీదపరుండబెట్టించి యివతలికితీసుకువచ్చారు. సాహేబు ఆపాదమస్తకమూ పరీక్షచేశాడు. దుర్గుణాలు కనిపించకపోయినా ఉపేక్షచేయడానికి ఆ సాహేబుకు ధైర్యం చిక్కలేదు. అనకపోతే వెంటనే మందు తయారుచేసి యిస్తాననీ, వేసిన అరగంటకల్లా మందు జవాబిస్తుందనీ నమ్మకం చెప్పుతూ మందు తయారుచేయడానికి ఒక మేబులం బాదంకాయలూ, అయిదుపలాల పుట్టతేనె, అర్ధశేరు ఆవుపాలూ వెంటనే తెప్పించమని సాహేబు ఉత్తరువుచేస్తూ "మీ అమ్మాయి ఆడుకొనే చింతగింజలూ, గన్నేరుకాయల బుట్టాకూడా తెప్పించండి. కావా" లన్నాడు. ఆవుపాలకోసరమూ, పుట్టతేనె కోసరమూ సీనయ్యకొడుకూ, ఇన్‌స్పెక్టరు పంతులు జవానూ పరుగుపెట్టేరు.

చింతగింజలూ, గన్నేరుకాయల బుట్ట కోసరం సీతమ్మ దక్షిణపుగదిలోకి పోయి మామూలుగా పెట్టే గూటిలో వెతికిందికాని ఆ బుట్ట కనబడలేదు. పెళ్లికిగాను తెచ్చిన బాదంకాయలబుట్ట ఆ గూటిలోనే వుంటే అది బయటికి తీసుకువస్తూ సీనయ్యపక్క కూర్చున్న తల్లి రంగమ్మతో "అన్నట్టు మరచిపోయినానే అమ్మా! ఆ బుట్టమళ్లీ తీసుకు

రానేలేదు- వారంరోజుల క్రిందట రెడ్డిగారి చెల్లక్క నా గన్నేరుకాయలబుట్ట తీసుకు పోయింది. ఆ గూట్లోవున్నదల్లా ఈ బాదం కాయలబుట్టే" అని ఆబుట్ట అక్కడ పెట్టింది.

ఆబుట్టకేసి చూస్తూ "ఈ బుట్టలో కాయలేనా నేను పగలగొట్టితిన్నది" అంటూ మంచంమీద పరున్న సీనయ్య లేచి ఒక్క గంతువేశాడు.

'నేనూ ఫోటో తీస్తా' —వాసన్.